సాక్షి
మంచిర్యాల
శుక్రవారం ၊ 5 ၊ మే ၊ 2023



బదిలీలకు వేళాయె..!

ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న కస్తూరిబా బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది బదిలీలకు విద్యా శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 8లో▸



అదుపు తప్పి లారీ బోల్తా 8లో▸

శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన ఎన్‌హెచ్ 363 రోడ్డుపై గురువారం లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి.

గరిష్టం/కనిష్టం
34.8 /26.6

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోత అధికంగా ఉంటుంది. అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రతీ గింజ కొనాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



ధాన్యం తేమను పరిశీలిస్తున్న కలెక్టర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): రైతుల కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. గురువారం హాజీపూర్ మండలం దొనబండ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం సందర్శించారు. రైతులతో మాట్లాడి సాగు వివరాలను, పెట్టుబడి, రాబడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అకాల వర్షాలకు కేంద్రంలో తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించి తేమ వివరాలు పర్యవేక్షించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలతోపాటు టార్పాలిన్లు, గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యం వివరాలను ట్యాబ్‌లలో విధిగా నమోదు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని తెలిపారు. వీలయితే తడిసిన ధాన్యాన్ని ముందుగా మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. కలెక్టర్ వెంట నాయబ్ తహసీల్దార్ హరిత, ఆర్‌ఐ లావణ్య, రైతులు ఉన్నారు.

ఆర్వోను కలిసిన భూనిర్వాసితులు




ఆర్వో జంబాజ్‌తో రఘునాథ్, నిర్వాసితులు

లక్సెట్టిపేట: జాతీయ రహదారితో భూమి కోల్పోయే నిర్వాసితులు తమకు న్యాయం చేయాలని ఎన్‌హెచ్ ఆర్వో జంబాజ్‌ను హైదరాబాద్‌లో గురువారం కలిశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో ఆర్వోను కలిసి రహదారి విస్తరణతో జరిగే నష్టాన్ని వివరించారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఇందుకు ఆర్వో సానుకూలంగా స్పందించారని, నిర్వాసితులను ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

మంచిర్యాలటౌన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇచ్చే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. గతంలోనే ప్రభుత్వం ప్రకటించిందని, కానీ ఇప్పటి వరకు ఇచ్చిన హామీని నెరవేర్చలేదని పేర్కొన్నారు. దీక్షలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తోట్ల మల్లేశ్‌యాదవ్, గోపతి సత్తయ్య, వెంకటస్వామి, క్యాతం రాజేశ్, అత్తె సాగర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటన విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

కాసిపేట: ఈనెల 8న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ బెల్లంపల్లికి రానున్నారని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తెలిపారు. మంత్రి పర్యటనను బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. మండలంలోని కొండపూర్‌యాపలో ప్రజాప్రతినిధులు, ముఖ్యకార్యకర్తలతో మంత్రి పర్యటనపై గురువారం సమావేశం నిర్వహించారు. సభకు భారీగా జనం తరలివచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, జెడ్పీటీసీ చంద్రయ్య, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అందుగులపేటను సందర్శించిన అదనపు కలెక్టర్



పరిశుభ్రత వివరాలు తెలుసుకుంటున్న రాహుల్

మందమర్రిరూరల్: మండలంలోని అందుగులపేట స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామంగా ఎంపిక కాగా, ఆ గ్రామాన్ని అదనపు కలెక్టర్ రాహుల్ గురువారం సందర్శించారు. తడి చెత్త, పొడి చెత్త నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, గ్రామంలో పరిశుభ్రతపై సర్పంచ్ తిరుపతిరెడ్డి, ఎంపీడీవో శశికళను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామాభివృద్ధికి సంబంధించి సమీక్ష నిర్వహించారు. పలు సూచనలు చేశారు.

ఎవరా ఇద్దరు..?

- 'చీకోటి' దందాలో జిల్లా వాసులు!
- థాయ్‌ల్యాండ్‌లో పట్టుబడినట్లు ప్రచారం..
- ఎవరెవరు ఉన్నారని ఆరా తీస్తున్న స్థానికులు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: థాయ్‌లాండ్‌లో గ్యాంబ్లింగ్ ఆడుతూ పట్టుబడిన వారిలో జిల్లా వాసులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో కీలకంగా ఉన్న 'చీకోటి'తో చాలా కాలంగా జిల్లా వారితోనూ సంబంధాలు ఉన్నాయి. గతంలో గోవా, హైదరాబాద్ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న జూదాల్లో పాల్గొంటున్నవారు ఉన్నారు. ఈనెల 1న థాయ్ పోలీసులు చట్టవిరుద్ధంగా గ్యాంబ్లింగ్ చేస్తున్నారంటూ అక్కడి ఓ హోటల్‌లో రైడింగ్ చేశారు. ఈ రైడ్‌లో 93 మందిని అక్కడి పోలీసులు అరెస్టు చేశారు. ఇందులో 83 మంది భారతీయులే. వారి నుంచి సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో ఎక్కువగా తెలుగు, అందులోనూ హైదరాబాద్, ఇతర జిల్లా ప్రాంత వాసులు ఉన్నారు. రాష్ట్రానికి చెందిన వారిలో వ్యాపారులు, రాజకీయ నాయకులు, రియల్టర్లు, ఉద్యోగులు ఉన్నారు. మంచిర్యాల జిల్లా నుంచి కూడా ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం.

దేశం దాటిన జూదం..

జిల్లాకు చెందిన పేకాటరాయుళ్లు.. పొరుగున ఉన్న మహారాష్ట్ర వెళ్లి పేకాడడం సాధారణం. ఇన్నాళ్లు రాష్ట్రం దాటిన జూదం.. ఇప్పుడు దేశం దాటినట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌తోపాటు గతంలో పేకాట వ్యసనంలో ఆరి తేరిన ఒకరు ఉన్నట్లు సమాచారం. జిల్లా నుంచి పలువురు పేకాట, కేసినో ఆడేందుకు తరచూ గోవా వెళ్తుంటారు. ఇటీవల జిల్లా నుంచి కొందరు దుబాయ్ మీదుగా థాయ్‌లాండ్ వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక కొందరు థాయ్‌లాండ్ జరుగుతున్న గ్యాంబ్లింగ్‌ను లైవ్‌లో సీసీ కెమెరాలతో హైదరాబాద్‌లో వీక్షిస్తూ, డబ్బులు పెట్టి ఆడుతున్నారు. ఇందులో ఈ ప్రాంత వాసులు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే కేసు, దర్యాప్తు అంతా విదేశాల్లోనే జరుగుతుండడంతో అధికారికంగా వివరాలేవి వెల్లడికావడం లేదు.

తెలంగాణలో నిషేధం..

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పేకాటను పూర్తిగా నిషేధించారు. దీంతో రమ్మీ లాంటి ఆటలు ఆడేందుకు వీలు లేకుండా పోయింది. ఏళ్లుగా పేకాటకు బానిసలుగా ఉన్న కొందరు కొంతకాలంపాటు మహారాష్ట్రలోని చంద్రాపూర్, రాజురా, సిరోంచ, సిర్పూర్ టీ సరిహద్దు పోడ్సా తదితర ప్రాంతాల్లో పేకాట క్లబ్‌ల్లో రాత్రింబవళ్లు ఆడేవారు. జిల్లా నుంచి ప్రతీరోజు అనేక మంది వెళ్తుండేవారు. జిల్లా వాసులే పేకాట నిర్వాహకులుగా ఉండేవారు. ఫంటర్లు (పేకాట ఆడేవారు)వాహనాల్లో తీసుకెళ్లేవారు.

స్పోర్ట్స్ క్లబ్‌ల మాటున..

స్పోర్ట్స్ క్లబ్‌ల మాటున అనధికారికంగా రూ.కోట్ల దందా సాగుతున్న తీరును మహారాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని నిర్వాహకులపై కేసులు నమోదు చేయడంతో అన్నిచోట్ల క్లబ్‌లు బంద్ అయ్యాయి. ఇప్పటికీ జిల్లాలో మామిడి తోటలు, అపార్ట్‌మెంట్లు రహస్య స్థావరాల్లో పేకాడుతూ పోలీసులకు చిక్కుతున్నారు. అప్పట్లో తెలంగాణ మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రా సరిహద్దు గ్రామాల్లో కొన్నాళ్లు పేకాట సాగింది. అన్ని చోట్లరైడింగ్‌లు జరుగుతుండడంతో రూటు మార్చి పేకాటరాయుళ్లు గోవా, దుబాయ్, థాయ్‌లాండ్‌కు వెళ్లి ఆడుతున్నట్లు తెలుస్తోంది. అక్కడ పేకాట కన్నా కేసినోకు ఎక్కువగా డిమాండ్ ఉండడంతో వ్యసనపరులు ఆ గేమ్‌లోనూ డబ్బులు పెట్టి ఆడుతున్నట్లు సమాచారం. విదేశీ పర్యటన పేరుతో రోజుల తరబడి వెళ్లి లక్షల రూపాయలు పోగొట్టుకుని ఇంటికి చేరుతున్నారు.



- వివరాలు 9లో▸

ముగిసిన 'సాక్షి' బ్యాడ్మింటన్ శిక్షణ

జిల్లా కేంద్రంలోని రంగంపేట మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత బ్యాడ్మింటన్ శిక్షణ గురువారం ముగిసింది. 30 మంది శిక్షణ పూర్తి చేసుకున్నారు.

ఇక నోట్ పుస్తకాలు ఉచితమే

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడుల్లో విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠ్య పుస్తకాలతోపాటు నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్ కూడా ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థులకు వర్క్‌బుక్స్, ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందించనుంది. పాఠశాలలు ప్రారంభమయ్యే వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్ అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ మంత్రి ఆదేశించారు. ఇప్పటికే పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. విద్యార్థులకు తగ్గట్టుగా తరగతి గదులు, రెండు మాధ్యమాల్లోనూ బోధన, మధ్యాహ్నం భోజనం అమలు చేస్తున్నారు. ప్రతీ విద్యార్థికి రెండు జతల ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, బాలికలకు ఆరోగ్యకిట్లు అందజేస్తోంది. దూరంగా ఉంటే రవాణా భత్యం చెల్లిస్తుంది. తాజాగా వర్క్‌బుక్స్, నోట్ బుక్స్ ఇవ్వాలని నిర్ణయించింది.

41,408 మంది విద్యార్థులకు ప్రయోజనం..

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల్లో పేద, మధ్య తరగతి వారే ఎక్కువ. పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ప్రభుత్వం నోట్ పుస్తకాల పంపిణీతో వారికి ఆర్థిక భారం తప్పనుంది. జిల్లాలో 510 ప్రాథమిక, 96 ప్రాథమికోన్నత, 108 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 41,408 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వర్క్‌బుక్స్ ఇవ్వనున్నారు. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తారు.

కేజీబీవీలో..

జిల్లాలోని 18 కేజీబీవీల్లో 4,325 మంది విద్యార్థులు చదువుతున్నారు. కరోనా కంటే ముందు నోట్‌పుస్తకాల పంపిణీ సక్రమంగానే సాగింది. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ అందించింది. 2020–21 విద్యాసంవత్సరం ముగింపులో మార్చి చివరన నోట్‌బుక్స్ అందజేశారు. 20211–22లో కూడా అదే మాదిరిగా పంపిణీ చేశారు, 2022–23కు సంబంధించిన నోట్‌పుస్తకాలు ఇంతవరకు ఇవ్వలేదు. కేజీబీవీ విద్యార్థులకు రెండు రకాలు రూల్డ్, ప్లేన్ నోటుబుక్స్ పంపిణీ చేశారు. 172 పేజీలతో కూడిన ఎనిమిది నోటుబుక్స్ అందజేశారు. ప్రస్తుతం సర్కారు బడుల్లో నోట్‌బుక్స్ అందించాలని నిర్ణయించారు. ఎన్ని వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్ ఇస్తారనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.

క్రమబద్ధీకరణకు మరో చాన్స్!

- ఈనెల 31 వరకు జీవో 58, 59 దరఖాస్తుల స్వీకరణ
- జిల్లాలో పోటెత్తుతున్న దరఖాస్తులు
- నస్పూర్, మంచిర్యాల మున్సిపాలిటీ నుంచే భారీగా..
- గ్రామాల్లో నామమాత్రమే..

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఈమేరకు జారీ చేసిన 58, 59 దరఖాస్తుల గడువు ఏప్రిల్ 30తో ముగియగా మరో నెల రోజులు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మే 31 వరకు అవకాశం కల్పించింది. జిల్లాలో 18 మండలాల నుంచి గడిచిన నెల రోజుల్లో మీ సేవ కేంద్రాలలో 9,500 వరకు దరఖాస్తులు వచ్చాయి. చివరి నాలుగు రోజుల్లో పెద్ద ఎత్తున దరఖాస్తులు రాగా, ఇందులో మంచిర్యాల, నస్పూర్, బెల్లంపల్లి నుంచే అధికంగా వచ్చాయి. జిల్లాలో ఏళ్ల తరబడి ప్రభుత్వ భూముల్లో పూరి గుడిసెలు, తాత్కాలిక నిర్మాణాలు ఉన్న చోట కొత్తగా శాశ్వత నిర్మాణాలకు ఉన్న అడ్డంకి తొలగిపోతుందని నిరుపేదలు ఎదురుచూస్తున్నారు. పట్టణ ప్రాంతంతోపాటు గ్రామాల్లో సైతం అవకాశం కల్పించడంతో ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న వారికి ప్రయోజనం కలుగనుండడంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. జీవో 58 ప్రకారం 125 గజాలలోపు ఉన్న స్థలాలను ఉచితంగానే ప్రభుత్వం క్రమబద్ధీకరించనుండగా, జీవో 59 ప్రకారం 125 నుంచి 250 గజాలలోపు స్థలాలకు సంబంధించి మార్కెట్ ధర ప్రకారం స్లాబ్‌ల వారీగా ప్రభుత్వ కనీస ధరల్లో 50 శాతం ధరతో రెగ్యులరైజ్ చేయనుంది. 250 నుంచి 500 గజాల స్థలం ఉన్న వాటికి 75 శాతం ధర, 500 నుంచి 1000 గజాల స్థలాల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టిన వాటిని ప్రభుత్వ కనీస ధర పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు ఏదైనా గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, ఏదైన డ్యాకుమెంట్‌తోపాటు స్థలం తమ ఆధీనంలో ఉన్నట్లు నిరూపించే ఆస్తి పన్ను రశీదు, విద్యుత్ బిల్లు, తాగునీటి బిల్లు, రిజిస్టర్ డాక్యుమెంట్లలో ఏదైనా ఒకటి జత చేయాల్సి ఉంటుంది. ఈ క్రమబద్ధీకరణకు రెవెన్యూ డివిజన్లలో ఆర్డీవోలు చైర్మన్లుగా, తహసీల్దార్లు కమిటీ సభ్యులుగా ఉంటారు. ఎలాంటి వివాదాలు లేని ప్రభుత్వ భూములు, ఎలాంటి అభ్యంతరాలు లేని స్థలాలను మాత్రమే క్రమబద్ధీకరిస్తారు.

రిజెక్ట్ అయినా.. మళ్లీ దరఖాస్తులు..

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టిన వారికి క్రమబద్ధీకరణ కోసం గతేడాది ఫిబ్రవరి 17న 58, 59 జీవోలు జారీ చేసింది. దీని ప్రకారం దరఖాస్తులు స్వీకరించింది. 40 రోజుల్లో 18 మండలాల నుంచి 3,636 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో నస్పూర్ మున్సిపాలిటీ నుంచి వచ్చినవే అధికంగా ఉన్నాయి. మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు,



క్షేత్రస్థాయిలో స్థలాల పరిశీలనకు 5 మందితో కూడిన నాలుగు ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టి ప్రత్యేక యాప్ లో నమోదు చేశాయి. ఇందులో 50 శాతం దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఈ ఏడాది ప్రభు త్వ, అసైన్డ్ భూముల్లో నిర్మించిన ఇళ్ల క్రమబద్ధీకరణకు 58, 59 జీవోల కింద మరోమారు దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. సింగరేణి స్థలాలని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన ఇళ్ల క్రమబద్ధీకరణకు జీవో 76 జారీ చేసింది. 58, 59 జీవోలకు సంబంధించి ఏప్రిల్ 1 నుంచి 30 వరకు దఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. జీవో 76 కింద దరఖాస్తుల స్వీకరణకు ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు మూడు నెలలపాటు దరఖాస్తులు చేసుకునే అవకాశం కల్పించింది. గతేడాది ఇదే జీవోల కింద 2014 జూన్ 2 తెలంగాణ ఏర్పడిన నాటికి ఆక్రమించిన ఇళ్లు నిర్మించుకున్నవారికి అవకాశం కల్పించగా, ఇప్పుడు ఆ గడువు 2020, జూన్ 2వ తేదీలోపు ఆక్రమించి ఇళ్లు కట్టుకున్న వారందరికీ అవకాశం ఇచ్చారు. పెంచిన గడువుతో ఈసారైన క్రమబద్ధీకరణ అవుతుందని గతంలో రిజెక్ట్ అయిన వారు మళ్లీ దరఖాస్తు చేసుకుంటున్నారు.

జాతీయ రహదారి విస్తరణ సర్వేను అడ్డుకున్న బాధితులు

- పనులు ముందుకు సాగకుండా నిరసన
- సర్వే నిలిపివేయాలని నాయాబ్ తహసీల్దార్‌కు వినతి



ముల్కల్లలో అధికారులతో మాట్లాడుతున్న బాధితులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల–ఆర్మూర్ 63వ నంబర్ జాతీయ రహదారి విస్తరణ సర్వేను నిర్వాసితులు అడ్డుకున్నారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) ఆధ్వర్యంలో హాజీపూర్ మండల పరిధిలో రెండు రోజులుగా రహదారి విస్తరణ భూసేకరణకు సంబంధించి రెవెన్యూ ఆధ్వర్యంలో సర్వే జరుగుతోంది. క్యాతన్‌పల్లి జాతీయ రహదారి నుంచి మంచిర్యాల మీదుగా చేపడుతున్న సర్వే పనులు హాజీపూర్ మండలం వేంపల్లి, ముల్కల్ల గ్రామాల వరకు వచ్చింది. ఈ క్రమంలో వేంపల్లి, ముల్కల్ల శివారు ప్రాంతాల్లో చేపట్టిన సర్వే ఆప్రాంత బాధితులు అడ్డుకున్నారు. వందల మంది భూయజమానులు పాల్గొని సర్వే ముందుకు జరగకుండా అడ్డుకున్నారు. భూసేకరణపై స్పష్టత రావాలని, వెంటనే ఆర్డీవో రావాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న నాయబ్ తహసీల్దార్ హరిత, హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. రహదారి సర్వే పనులు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాగుతున్నాయని వివరించారు. నాలుగు వరసల రహదారి కోసం తమ ఇళ్లు, భూములు ఇచ్చేది లేదని, మిషన్ భగీరథ పైప్‌లైన్ కోసం కొంత మందిని బలి చేశారని పేర్కొన్నారు. కొంత మంది రియల్ వ్యాపారుల కోసం రోడ్డు మ్యాప్ మార్చారని ఆరోపించారు. అసలు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టకుండానే భూసేకరణకు నోటిఫికేషన్ ఎలా ఇస్తారని మండిపడ్డారు. తమకు న్యాయం జరిగే వరకు సర్వే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. భూసేకరణ సమయంలో గ్రామసభల ద్వారా పూర్తి సమాచారం అందించి సర్వే చేపడుతున్నామని చెప్పిన ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు కనీస సమాచారం లేకుండా సర్వే చేయించడం ఎంత వరకు సమంజసం అన్నారు. కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేసి భూసేకరణపై పూర్తి స్పష్టత ఇచ్చిన తర్వాతనే సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఈమేరకు నాయబ్ తహశీల్దార్ హరితకు వినతిపత్రం అందజేసి సర్వే నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో వేంపల్లి, ముల్కల్ల భూ యజమానులు, ఆర్‌ఐ లావణ్య, సర్వేయర్ మధూకర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలటౌన్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఫిజియోథెరపి, మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్ కేంద్రాలు ప్రారంభించినట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఎమ్మెల్యే దివాకర్ రావుతో కలిసి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపి, మానసిక ఆరోగ్య కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో అందించే వైద్య సేవలను ప్రజలకు తెలిసేలా నోటీస్ బోర్డులో ఉంచాలని సూచించారు. మానసిక అనారోగ్యానికి సంబంధించిన అనుమానాలు, చికిత్స కోసం టెలిమానస్ టోల్ ఫ్రీ నంబర్ 14416లో సంప్రదించవచ్చని తెలిపారు. ప్రజలకు తెలిసేలా దీనిపై ప్రచారం చేయాలని పేర్కొన్నారు.



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పి.గౌతమి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, ఆర్‌ఎంవో డాక్టర్ భీష్మ, ప్రోగ్రాం అధికారి డాక్టర్ విజయపూర్ణిమ, వైద్యులు డాక్టర్ సునీల్, డాక్టర్ ప్రశాంతి, నోడల్ అధికారి లింగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మాదంశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

సింగరేణి పట్టాల కోసం డీడీలు కట్టాలి

- అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్

రామకృష్ణాపూర్: సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఇది వరకే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 400 మంది ఈనెల 7లోగా డీడీలు చెల్లించి పట్టాలు పొందాలని అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ తెలిపారు. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సభ్యులతో గురువారం సమీక్ష నిర్వహించారు. జీవో 76 ప్రకారం సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారు రామకృష్ణాపూర్ పట్టణంలో దాదాపు అందరూ డీడీలు కట్టి రిజిస్ట్రేషన్ కూడా పూర్తి చేసుకున్నారని తెలిపారు. 400 మంది డీడీలు కట్టాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం మరో 3 రోజులు అవకాశం కల్పిస్తున్నందున డీడీ చెల్లించి పట్టాలు పొందాలని సూచించారు. సమీక్షలో మంచిర్యాల ఆర్డీవో వేణు, మందమర్రి తహసీల్దార్ సంపతి శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, కమిషనర్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్‌నాయక్

మంత్రి కేటీఆర్ పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

బెల్లంపల్లి: రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు ఈనెల 8న బెల్లంపల్లి పర్యటనకు రానున్నారని, ఈమేరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్న స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్, మిషన్ భగీరథ పంపుహౌస్, రహదారులు, బహిరంగ సభ నిర్వహించే ఏఎంసీ క్రీడా మైదానాన్ని స్థానిక ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి గురువారం పరిశీలించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంత్రి పర్యటనకు ప్రజలు భారీగా హాజరయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈమేరకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మంత్రి సభ సజావుగా జరిగేలా, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో కె.శ్యామలాదేవి, ఏసీపీ పంతాటి సదయ్య, ఇన్‌చార్జి తహసీల్దార్ మాణిక్‌రావు, సీఐ, ఎస్సైలు ఉన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: వేసవికాలం దృష్ట్యా జిల్లాలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో నీటిపారుదల, మిషన్ భగీరథ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా చేపట్టాల్సిన చర్యలపై కార్యచరణ రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా జిల్లాలోని అన్ని నివాసాలకు నల్లా కనెక్షన్ ఇచ్చి తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని చేపట్టిన వివిధ శాఖల సంబంధిత అభివృద్ధి పనులతో దెబ్బతిన్న మిషన్ భగీరథ పథకం పైప్‌లైన్ల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.అంజన్‌రావు, డీఈలు, ఏఈలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆ అపార్ట్‌మెంట్‌లో మళ్లీ చోరీ..

- సింగరేణి కార్మికుడి ఫ్లాట్‌లో బంగారు ఆభరణాల అపహరణ
- మూడు రోజుల వ్యవధిలో మూడిళ్లలో దొంగతనం
- ఆందోళనలో అపార్ట్‌మెంట్ వాసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఆధిత్య ఎన్‌క్లేవ్స్ కృతిక అపార్ట్‌మెంట్‌లో మరో చోరీ జరిగింది. మూడు రోజుల క్రితం రెండు ఫ్లాట్లలో ఇద్దరు దొంగతనం చేశారు. తాజాగా గురువారం అదే అపార్ట్‌మెంట్‌లోని సింగరేణి కార్మికుడి ఇంటికి కన్నం వేశారు. ఆరు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. సింగరేణి కార్మికుడు వినయ్ కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లారు. వినయ్ రోజువారీగానే ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లాడు. విధులు ముగించుకుని ఇంటికి వచ్చే సరికి మెయిన్ డోర్ తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో దొంతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుగుణాకర్ తెలిపారు.

పోలీసులకు సవాల్..

కృతిక అపార్ట్‌మెంట్‌లో వరుస దొంగతనాలు అపార్ట్‌మెంట్ వాసులను ఆందోళనకు గురిచేస్తున్నా యి. మూడు రోజుల క్రితం పట్టపగలు ఇద్దరు వ్యక్తులు కారులో వచ్చి రెండు ఫ్లాట్లలో చోరీ చేశా రు. సీసీ కెమెరాలు ఉన్నా... అనుమానితుల దృశ్యాలు అందులో నమోదైనా పోలీసులు వారి ని పట్టుకోలేదు. దీంతో తాజాగా గురువారం మ ధ్యాహ్నం మరో చోరీ జరగడం పోలీసులకు దొంగలు సవాల్ విసిరినట్లయింది. దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తున్నారు. ముందే రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలు స్తోంది. ఇప్పటికైనా పోలీసులు దొంగలను పట్టుకోవాలని అపార్ట్‌మెంట్‌వాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


రాసమల్ల అశోక్‌గౌడ్ మృతదేహం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నంనూర్ గ్రామానికి చెందిన రాసమల్ల అశోక్‌గౌడ్(33) మృతి చెందాడు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం... నంనూర్‌కు చెందిన అశోక్‌గౌడ్ బుధవారం సొంత పనిపై హాజీపూర్ నుంచి ఇంటికి వస్తున్నాడు. హాజీపూర్ సబ్‌స్టేషన్ సమీపంలో అశోక్‌గౌడ్ వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. స్థానికులు 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అశోక్‌గౌడ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య నవ్య ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు నుంచి పడి యువకుడు దుర్మరణం


రాంకుమార్(ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): మండలంలోని పులి కుంట గ్రామ సమీపంలో కైరిగూడ గ్రామానికి చెందిన ఆజ్మీర రాంకుమార్ (20) అనే యువకుడు ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మృతి చెందినట్లు బెల్లంపల్లి ఇన్‌చార్జి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాంకుమార్ కూలీ పనులు చేసుకుంటూ జీవించేవాడు. గురువారం తెల్లవారుజామున రాంకుమార్ బంధువు లక్ష్మణ్‌తో కలిసి భాగ్యనగర్ రైలులో ఖాజీపేట్‌కు బయలుదేరాడు. ఈక్రమంలో మండలంలోని పులికుంట సమీపంలో ప్రమాదవశాత్తు రాంకుమార్ రైలు నుంచి కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సురేశ్‌గౌడ్ తెలిపారు.

పెళ్లి బరాత్‌లో కత్తులతో హల్‌చల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీలో బుధవారం అర్ధరాత్రి జరిగిన ఓ వివాహ వేడుకల్లో భాగంగా బరాత్ నిర్వహించారు. ఈ క్రమంలో స్థానిక గద్దెరాగడి సమీపంలోని అమ్మ గార్డెన్ ప్రాంతానికి చెందిన గుర్తు తెలియని ఇద్దరు యువకులు మద్యం మత్తులో డ్యాన్స్‌లు చేస్తున్న బృందంలో చొరబడి అల్లరి సృష్టించారు. దీంతో పెళ్లి కుటుంబ సభ్యులు అడ్డుకునే ప్రయత్నం చేయగా సదరు యువకులు కత్తులతో హంగామా సృష్టించారు. దీంతో గొడవ జరుగగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. గొడవకు పాల్పడిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ రాజు తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు


రత్నం సౌజన్య

వాంకిడి: మండలంలోని సరాండి గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యం అయినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సరాండి గ్రామానికి చెందిన రత్నం సౌజన్య(20) బుధవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. సౌజన్య మొబైల్ ఫోను సైతం స్విచ్ఆఫ్ రావడంతో తండ్రి రత్నం మోహన్‌బాబు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

బదిలీలకు వేళాయె!

- కేజీబీవీలో బోధన, బోధనేతర సిబ్బందికి ట్రాన్స్‌ఫర్స్
- శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- కొత్త జిల్లాల ప్రకారం బదిలీలు
- మార్గదర్శకాలు విడుదల చేసిన విద్యాశాఖ



మంచిర్యాలఅర్బన్/నిర్మల్‌రూరల్/ఆదిలాబాద్ టౌన్ : ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న కస్తూరిబా బాలికల విద్యాలయా(కేజీబీవీ)ల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది బదిలీలకు విద్యాశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కేజీబీవీలో విధులు నిర్వహించే స్పెషల్ ఆఫీసర్, పీజీ సీఆర్‌టీ, సీఆర్‌టీ, ఏఎన్‌ఎం, అకౌంటెంట్, పీఈటీలకు షిఫ్టింగ్ అవకాశం కల్పించింది. ప్రస్తుతం పనిచేస్తున్న విద్యాలయాల్లో 01–05–23 నాటికి రెండు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన వారు అర్హులుగా ప్రకటించింది. విల్లింగ్ (ఇష్టం)ఉన్న అభ్యర్థులు మాత్రమే బదిలీల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన బుధవారం రాత్రి మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈనెల 6 నుంచి 9వరకు https:// transfers. cdse. telangana. govt. in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దీంతో ఎన్నో ఏళ్లుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

షెడ్యూల్ విడుదల..

కేజీబీవీ ఉపాధ్యాయుల బదిలీల కోసం ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈనెల 1వ తేదీ నాటికి కేజీబీవీలో రెండు సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న వారు బదిలీలకు అర్హులు. బదిలీ కోరుకునే ఉద్యోగులు ప్రభుత్వ వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అభ్యర్థులు ఇచ్చిన వెబ్ ఆప్షన్ల ప్రకారం వెబ్ కౌన్సిలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియ జరుగుతుంది. కలెక్టర్ చైర్మన్‌గా, అడిషనల్ కలెక్టర్ మెంబర్‌గా, డీఈవో మెంబర్ సెక్రటరీగా ఉంటారు. సిబ్బంది ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలో పనిచేసిన కాలానికి సంవత్సరానికి మూడు పాయింట్ల చొప్పున పనితీరు ఆధారిత పాయింట్లు కేటాయిస్తారు. ప్రాధాన్యత కేటగిరీ కింద వికలాంగులు, వితంతువులు, న్యాయపరంగా విడాకులు పొందినవారు, వివిధ వ్యాధులతో బాధపడేవారు, వివిధ వ్యాధులతో బాధపడే పిల్లలు గల సిబ్బంది, అవివాహితులు, మొదలైన కేటగిరీ ఉన్న వారిని ఉన్నవారికి మొదట ప్రాధాన్యత ఉంటుంది. ఖాళీలతోపాటు పరస్పరం అంగీకారం(ఇష్టపడే) జిల్లా, అంతర్ జిల్లా షిఫ్టింగ్(బదిలీ)కు అవకాశం కల్పించనున్నారు.

ఉమ్మడి జిల్లా కేజీబీవీల్లో బోధన, బోధనేతర సిబ్బంది వివరాలు..

జిల్లా	కేజీబీవీలు	టీచింగ్	నాన్‌టీచింగ్
మంచిర్యాల	18	193	133
ఆదిలాబాద్	17	230	231
నిర్మల్	18	187	206
కుమురం భీం	15	165	126

ఉమ్మడి జిల్లాలో ఇలా...

- మంచిర్యాల జిల్లాలో 18 కేజీబీవీలున్నాయి. ఇందులో స్పెషల్ ఆఫీసర్ పోస్టు ఒకటే ఖాళీగా ఉంది. పీజీ సీఆర్‌టీలు 63 మందిగాను 32 మంది విధులు నిర్వహిస్తున్నారు. సీఆర్‌టీ, పీఈటీలు 145 మందికి 135, ఏఎన్‌ఎంలు 18 పోస్టులకు 18 మంది పనిచేస్తున్నారు.
- నిర్మల్ జిల్లాలో మొత్తం 18 కేజీబీవీలు ఉండగా అందులో టీచింగ్ విభాగంలో మొత్తం 222 పోస్టులు మంజూరుకాగా 187 మంది పనిచేస్తున్నారు. 35 పోస్టులు ఖాళీలు ఉన్నాయి. నాన్ టీచింగ్ విభాగంలో మొత్తం 252 పోస్టులు మంజూరు కాగా, 206 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 46 ఖాళీలు ఉన్నాయి.
- ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 17 కేజీబీవీలు ఉన్నాయి. టీచింగ్ పోస్టులు 230 మంజూరు కాగా, ప్రస్తుతం 175 మంది పనిచేస్తున్నారు. 55 ఖాళీలు ఉన్నాయి. నాన్ టీచింగ్ పోస్టులు 332 ఉండగా, 208 మంది పనిచేస్తున్నారు.
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 15 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో టీచింగ్ విభాగంలో 219 పోస్టులు ఉండగా 130 మంది పనిచేస్తున్నారు. 89 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నాన్‌టీచింగ్ విభాగంలో 216 పోస్టులు ఉండగా 134 మంది పనిచేస్తున్నారు. 72 ఖాళీలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

మూడు విధాలుగా బదిలీలు..

బదిలీల ప్రక్రియ మొత్తం మూడు రకాలుగా జరుగుతుంది. ఉద్యోగుల పరస్పర బదిలీలు, జిల్లాల మధ్య పరస్పర బదిలీలు, జిల్లాలో బదిలీలు ఉంటాయి. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగి పరస్పర అంగీకారంతో బదిలీ అయ్యే అవకాశాన్ని ప్రభుత్వం ఈసారి కల్పించింది. సాధారణ బదిలీలు మాత్రం కొత్త జిల్లాల ప్రకారం జరుగుతాయి. కానీ పరస్పర బదిలీలు కొత్త జిల్లా, ఉమ్మడి జిల్లా ప్రకారం కూడా జరుగుతాయి. స్పౌజ్ విభాగం కింద బదిలీ కోరుకునే వారికి స్పౌజ్ పని చేసే ప్రాంతానికి దగ్గరగా ఉన్న ప్రాంతానికి మాత్రమే ట్రాన్స్‌ఫచేస్తారు. బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల దరఖాస్తు పత్రాలను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల ద్వారా ఏర్పడిన కమిటీ సభ్యులు పరిశీలిస్తారు. ప్రాధాన్యత విభాగం సర్టిఫికెట్లు, పనితీరు ఆధారిత పాయింట్లు, పరస్పర బదిలీ అభ్యర్థన సర్టిఫికెట్లు మొదలైనవి ఆన్‌లైన్‌లో దరఖాస్తు తోపాటు అప్‌లోడ్ చేయాలి. అదేవిధంగా వీటి జిరాక్స్ పత్రాలను ఆన్‌లైన్ దరఖాస్తు పత్రాలతో జత చేయాల్సి ఉంటుంది.

ఇదీ షెడ్యూల్....

బదిలీల ప్రక్రియ మొదలు : 05–05–2023
ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు : మే 6 నుంచి మే 9 వరకు
ఆన్‌లైన్ దరఖాస్తులను జిల్లా కార్యాలయంలో సమర్పించే తేదీలు : మే 10, 11
దరఖాస్తుల పరిశీలన, ఆమోదం : మే 12 నుంచి 15 వరకు
పాయింట్లతో కూడిన జాబితా విడుదల : మే 16
అభ్యంతరాలు సమర్పించు తేదీలు : మే 17, 18
అభ్యంతరాల పరిశీలన తేదీలు : 18, 19
తుది జాబితా విడుదల : మే 20
వెబ్ ఆప్షన్స్ నమోదు తేదీలు : మే 21, 22
వెబ్ ఆప్షన్స్ పరిశీలన, ఆమోదం తేదీలు : మే 23, 24
వెబ్ అలాట్‌మెంట్ బై టీఎస్ ఆన్‌లైన్ : మే 25, 26
బదిలీల ఉత్తర్వులు, జాయినింగ్ : మే 27 నుంచి 29 వరకు

సద్వినియోగం చేసుకోవాలి



కేజీబీవీలో పనిచేసే ఉపాధ్యాయ సిబ్బందికి బదిలీల ప్రక్రియ నేటి నుంచి ప్రారంభమవుతుంది. సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎలాంటి అవకతవకలు జరగకుండా పగడ్బందీగా పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఈ ప్రక్రియ కొనసాగిస్తాం. సుమారు 25 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంది.
– రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

కేజీబీవీల్లో షిఫ్టింగ్‌కు ఉత్తర్వులు



జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, సిబ్బందికి షిఫ్టింగ్ పద్ధతిలో బదిలీల కోసం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈనెల 6నుంచి 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రెండేళ్ల సర్వీస్ పూర్తయినవారికే అవకాశం ఉంది. వీటికి సంబంధించి పూర్తి మార్గదర్శకాలు వెబ్ సైట్‌లో పొందుపర్చడం జరిగింది.
– ప్రణీత, డీఈవో, ఆదిలాబాద్

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి


కార్మికులు, నాయకులతో కలిసి నినాదాలు చేస్తున్న రాయిల్ల నర్సయ్య

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గోలేటి బ్రాంచీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాయిల్ల నర్సయ్య అన్నారు. గురువారం ఖైరిగూడ ఓసీపీలో కాంట్రాక్టు కార్మికులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా చాలీచాలనీ వేతనాలతో పని చేస్తున్న కార్మికులు పెరిగిన ధరలతో ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచటంలో యాజమాన్యం విఫలమైందన్నారు. కార్మికులకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందించాలని, ప్రతీ నెల 7వ తేదీలోపు వేతనాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి అశోక్, నాయకులు రాజశేఖర్, శేఖర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

పాతమంచిర్యాల: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆల్ ఇండియా కిసాన్ మజ్దూర్ సభ రాష్ట్ర కార్యదర్శి లాల్‌కుమార్ డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈమేరకు గురువారం ధర్నా నిర్వహించి అడిషనల్ కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం లాల్‌కుమార్ మాట్లాడుతూ రైతులు ఆరుగాలం పండించిన పంటలు అకాల వర్షాలతో నీట మునిగి తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో స్థలంలేక రైతులు పొలాలలోనే ధాన్యం నిల్వ చేస్తున్నారని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దొండ ప్రభాకర్, జిల్లా కార్యదర్శి రత్నం తిరుపతి, నాయకులు శ్రీనివాస్, మల్లన్న, దుగుట రమేశ్, అరుణ పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా


బోల్తాపడిన లారీ


గాయపడిన డ్రైవర్ నరేశ్


క్లీనర్ బాలు

- ఎన్‌హెచ్ 363పై ప్రమాదం
- ఐదుగురికి తీవ్ర గాయాలు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన ఎన్‌హెచ్ 363 రోడ్డుపై గురువారం లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం... మహారాష్ట్ర నుంచి పత్తి బేళ్ల లోడ్ వేసుకుని ఆంధ్ర ప్రాంతానికి వెళ్తున్న లారీ రామకృష్ణాపూర్ నుంచి వస్తూ జీఎం కార్యాలయం వద్ద గల ఫ్లైఓవర్ వంతెన మీద నుంచి గోదావరిఖని వైపు దిగుతుండగా మూల మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ఎం.నరేశ్, క్లీనర్ బాలు గాయపడ్డారు. వీరు ఖమ్మం జిల్లా వాసులుగా గుర్తించారు. ప్రమాద సమయంలో రోడ్డు నిర్మాణ పనుల్లో ఇతర రాష్ట్రాల కూలీల పనిచేస్తున్నారు. లారీలోని బేళ్లు కూలీపై పడడంతో సుధీర్‌బాయి, దేవరాజ్, కడాల్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108, పోలీసులకు సమాచారం అందించారు. వారు చేరుకుని క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద స్థలాన్ని శ్రీరాంపూర్ ఎస్సై మానస పరిశీలించారు. ఓవర్‌లోడ్, స్పీడ్‌తోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కొత్తగా నిర్మించిన ఈ రోడ్డుపై ఇదే మొదటి ప్రమాదం. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏరియా సెక్రెటరీకి సన్మానం



మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం టీబీజీకేఎస్‌లో శ్రీరాంపూర్ ఏరియా సెక్రెటరీగా నియామకమైన గడ్డం మహిపాల్‌రెడ్డిని గురువారం ఏరియా వర్క్‌షాప్ వద్ద ఆటో గ్యారేజీలోని ఎంవీ డ్రైవర్స్ సన్మానించారు. ఇక నుంచి నిరంతరం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పని చేయాలని వారు ఆకాంక్షించారు. అనంతరం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, అధ్యక్షులు బీ వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, బ్రాంచీ ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచీ అసిస్టెంట్ సెక్రెటరీ బ్రహ్మచారీ, ఫిట్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, ఆటో గ్యారేజీ ఈఈ రవికుమార్, సూపర్‌వైజర్ మహేశ్ రాజ్, చిప్ప మోహన్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు ప్రమోషన్లు


ప్రమోషన్ పత్రాలు అందిస్తున్న మేనేజర్ తిరుపతి

శ్రీరాంపూర్: ప్రతీ సంవత్సరం యాక్టింగ్ ప్యానల్ ప్రకారం ఇచ్చే ప్రమోషన్లను గురువారం ఆర్కే 6 గనిలో ఉద్యోగులకు అందించారు. గనిపై జరిగిన కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి 40 మందికి హాలర్ ఆపరేటర్, పంపు ఆపరేటర్, కోల్ కట్టర్, సపోర్టుమెన్, లైన్‌మెన్, హెల్పర్ ప్రమోషన్ ఆర్డర్ కాపీలను అందించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి కాదాసి శ్రీనివాస్, ఫిట్ ఇంజనీర్ శ్యాంకుమార్, సంక్షేమ అధికారి సునిల్‌కుమార్, గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ నాయకులు ఇప్ప భూమయ్య, నాయకులు వెంకట్రాజం, అద్దు శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు ఎంపిక

మంచిర్యాలఅగ్రికల్చర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఉచిత విద్యాభ్యాసానికి 1వ తరగతి ప్రవేశానికి జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులకు లక్కీ డ్రా పద్ధతిన ఎంపిక చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ బి. రాహుల్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల ఎంపికకు నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమానికి హాజరయ్యారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి షెడ్యూల్డ్ కులం విద్యార్థుల నుంచి 17 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. బెల్లంపల్లి మండలం చంద్రవెల్లికి చెందిన జంగపల్లి అహిలన్ శ్రేష్ఠ, నస్పూర్ మండలం గాంధీనగర్‌కు చెందిన బెక్కం శ్రేష్ఠలు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పి.రవీందర్‌రెడ్డి, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి ఎం.రవీందర్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవంలో జిల్లా నేతలు


ఢిల్లీలో మంత్రి కేటీఆర్‌తో జాన్సన్‌నాయక్, దండె విఠల్, తదితరులు

ఖానాపూర్: ఢిల్లీలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేతలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్, మంత్రి కేటీఆర్ మిత్రుడు ఖానాపూర్ నియోజకవర్గ నేత భూక్య జాన్సన్‌నాయక్ పాల్గొన్నారు. బుధవారం ఖానాపూర్‌లో పర్యటించిన జాన్సన్ నాయక్ రాత్రి మంత్రి కేటీఆర్‌తో కలిసి విమానంలో ఢిల్లీ వెళ్లారు.

సీపీఆర్‌పై 108 సిబ్బందికి శిక్షణ


సీపీఆర్‌పై శిక్షణ పొందుతున్న 108 సిబ్బంది

మంచిర్యాల టౌన్: జిల్లా కేంద్రంలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఉమ్మడి జిల్లాలో 108 అంబులెన్సులో విధులు నిర్వహిస్తున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు సీపీఆర్‌పై గురువారం శిక్షణ ఇచ్చారు. నాలుగు రోజులుగా సీపీఆర్, బేసిక్ లైఫ్ సపోర్టు కార్యక్రమంపై ఈఎంఆర్‌ఐ గ్రీన్ హెల్త్ అధికారులు గజేందర్, అరుణ్ ఆధ్వర్యంలో సీపీఆర్ పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా 108 వాహనాల ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, కొండలరావు, సతీశ్ పాల్గొన్నారు.

విమానం చక్కర్లు


తక్కువ ఎత్తులో ప్రయాణిస్తున్న విమానం

దండేపల్లి: మండలంలో వారంరోజులుగా ఓ మినీ విమానం(చార్టర్ ఎరోప్లేన్) గాలిలో అతి తక్కువ ఎత్తులో (సెల్‌టవర్‌ను తాకేలా) చక్కర్లు కొడుతోంది. విమానం చక్కర్లు కొట్టడంపై మండల ప్రజలు ఇది ఏమిటి, ఎక్కడిది, రోజు ఎందుకు వస్తుందని అని చర్చించుకుంటున్నారు. విమానానికి రాడర్స్ కూడా కనిపిస్తున్నాయి. దీంతో ఏమైన సర్వే నిర్వహిస్తున్నారో తెలియడం లేదు.

ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్

బెల్లంపల్లిరూరల్: ప్రజాసమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేన శంకర్, జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. సీపీఐ బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ చేపట్టిన ప్రజాపోరు యాత్ర 17వ రోజు గురువారం బెల్లంపల్లి మండలానికి చేరుకుంది. మండలంలోని పాతబెల్లంపల్లి గ్రామంలో యాత్రకు నాయకులు, గ్రామస్తులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం సీపీఐ ప్రజాపోరుయాత్ర చేపట్టిందన్నారు. ఈ యాత్ర మండలంలోని పాతబెల్లంపల్లి, ఆకెనపల్లి, బుచ్చయ్యపల్లి, లింగాపూర్ గ్రామాల్లో కొనసాగనుంది. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు మేకల దాసు, జిల్లా కార్యవర్గ సభ్యులు దాగం మల్లేష్, మామిడాల రాజేశం, రవి, జిల్లా సమితి సభ్యులు బొంతల లక్ష్మీనారాయణ, చంద్రమాణిక్యం, చంద్రకళ, గంగారాం పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకూ పోరాటం


మాట్లాడుతున్న ఆశయ్య

చెన్నూర్‌రూరల్: పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చేంత వరకూ పోరాటం ఆగదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పైళ్ల ఆశయ్య అన్నారు. చెన్నూర్ మండలంలోని బావురావుపేట గ్రామ శివారులోని అసైన్డ్ భూములను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బావురావు పేట గ్రామ శివారులో కొందరు అసైన్డ్ భూమిని కబ్జా చేసుకొని ప్లాట్లు చేసి అమ్ముకున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ భూమిని కాపాడుకోవాల్సిన అధికారులు పేదలపైన కేసులు పెట్టి కబ్జాదారులను కాపాడుతున్నారని పేర్కొన్నారు. పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చి పెట్టిన అక్రమ కేసులు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శులు సంకె రవి, దాసరి రాజేశ్వరి, జిల్లా కమిటీ సభ్యుడు చందు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం సింగరేణి బకాయిలు చెల్లించాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణి నుంచి బొగ్గు, విద్యుత్ కొనుగోలు చేసి బాకీపడిన రూ.25వేల కోట్లను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. గురువారం ఆయన ఆర్కేన్యూటెక్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. ఈ బకాయిలు చెల్లించకపోవడంతో సంస్థ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. బీఎంఎస్ పోరాటంతో సీఎంపీఎఫ్ సేవలు మే నెల నుంచి ఆన్‌లైన్ ద్వారా పొందే వీలు కల్పించారన్నారు. తమ యూనియన్ వేజ్‌బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి సీఎంపీఎఫ్ కమిషనర్‌తో మాట్లాడి ఒత్తిడి తేవడంతో ఈ ఆన్‌లైన్ సేవలు అందుబాటులో వస్తున్నాయన్నారు. దీంతో ఉద్యోగులు వారి ఖాతాలో ఎంత మొత్తం డబ్బు ఉందో వివరాలను ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. దీంతో ఆ శాఖ నుంచి పొందే పలు సేవలు సులువు అవుతాయన్నారు. బొగ్గు గని కార్మికుల 11 వేతన ఒప్పందం రెండు సంఘాల వైఖరితో గత సమావేశాలు వాయిదా పడ్డాయన్నారు. ఏదీఏమైనా కార్మికులకు బీఎంఎస్ మెరుగైన ఒప్పందం సాధించి పెడుతుందన్నారు. ఈ సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెండ్లి మోహన్ రెడ్డి, కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు తలారీ వినయ్‌కుమార్, మాదాసు రవీందర్, బోడకుంట శ్రీధర్, మేకల స్వామి, సంపత్, నీరటి శ్రావణ్‌కుమార్, చల్లా ప్రశాంత్ పాల్గొన్నారు.

పట్టపగలే ఇంటికి కన్నం


వేలిముద్రలు సేకరిస్తున్న అధికారులు

వాంకిడి: ఇంట్లో ఎవరూ లేని సమయంలో పట్టపగలే దొంగలు ఓ ఇంటికి కన్నమేసిన సంఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై డి.సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని హనుమాన్‌వాడకు చెందిన మెంగ్రె తిరుపతి బుధవారం ఆసిఫాబాద్ మండలం దస్నాపూర్ గ్రామానికి ఉదయం 11 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి వివాహానికి వెళ్లాడు. అదేరోజు సాయంత్రం ఇంటికి తిరిగొచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంటి లోపలికి వెళ్లి చూడగా సామాన్లు చిందరవందరగా పడి ఉండడంతో పాటు బీరువాలో ఉన్న 9 గ్రాముల నల్ల పూసల బంగారం తాడు, రూ.45 వేల నగదు దొంగతనానికి గురైనట్లు బాధితులు పేర్కొన్నారు. గురువారం వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.